మదర్ డెయిరీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, జనవరి 31 : మదర్ డెయిరీ రైతులకు చెల్లించాల్సిన రెండు నెలల పాల బకాయిలు రూ.25కోట్లను వెంటనే చెల్లించి సంస్థ ఎలా నష్టాల్లోకి వెళ్లిందో రైతులకు తెలుపాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పాడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పాల ఉత్పత్తిదారులకు 15రోజుల కోసారి బిల్లులు చెల్లించేదన్నారు. ప్రస్తుత పాలకవర్గం నిర్లక్ష్యం మూలంగా నాలుగు దఫాలుగా 25కోట్ల రూపాయలు చెల్లించక పోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం లీటరుకు 4రూపాయల ప్రోత్సాహకం ఇస్తామని చెప్పి చేతులు దులుపుకొందని విమర్శించారు. పశువుల దాణాకు, పాడి సంరక్షణకు, మందులకు, గడ్డి విత్తనాలపై 50శాతం సబ్సిడీ ఇచ్చి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. లేకుంటే పాడి రైతులతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతుసంఘం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు అంబటి మల్లారెడ్డి, బిట్ల రాంరెడ్డి, ఏళ్ల సంతోష్‌రెడ్డి, కూనూరు వెంకటేశం, రషీద్, స్వామి, సత్యం పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

భూదాన్ పోచంపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, జనవరి 31 : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఐదో మహాసభల సందర్భంగా శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడానికి విశ్వవిద్యాలయాల్లో యూజీసీ ప్రతిపాదనకు తెరలేపిందన్నారు. ఈ ప్రతిపాదనతో రాష్ట్ర యూనివర్సిటీల పూర్తి అధికారం కేంద్ర ప్రభుత్వం చేతిలోకి వెళ్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాసే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో మతోన్మాద భావాలు చొప్పిస్తూ దేశ విశ్వవిద్యాలయాల్లో అభ్యుదయ భావజాలంపై దాడులు పెంచుతుందని, విద్యార్థులకు పూటకో పురాణం వల్లిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుంచి విద్యార్థుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రిని నియమించి, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కక్కుట్ల శివాని, జిల్లా నాయకులు పల్లె శివకుమార్, వేముల నాగరాజు, కాసుల నరేశ్, గంగాదేవి సాయినాథ్, జగన్, శ్రీనివాస్, ఉదయ్, పవన్, ప్రజా సంఘాల నాయకులు కొండమడుగు నర్సింహ, కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, జగన్, లింగారెడ్డి, మధు, శ్రీహరి, అనిల్, వికాస్, నందు, విక్రం, రాకేశ్, సిద్ధు పాల్గొన్నారు.

అడవి దున్న కోసం అధికారుల గాలింపు చర్యలు

పల్లెర్లలో అడవి దున్న జాడను పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు

ఆత్మకూరు(ఎం), జనవరి 31 : మండలంలోని పల్లెర్ల గ్రామ శివారులో పెసరు బండ సమీపంలోని చెట్ల పొదల్లో గురువారం అడవి దున్న సంచరించిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతానికి అటవీ శాఖ, పోలీస్, రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు. దాన్ని పట్టుకునేందుకు గురువారం రాత్రి నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో డ్రోన్ కెమెరాతో పరిశీలించారు.

అడవి దున్న పల్లెర్ల నుంచి వలిగొండ మండలం నర్సాపురం వైపు వెళ్లినట్లు డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

వాగులో పడిన వ్యక్తిని కాపాడిన గ్రామస్తులు

కొలనుపాక వాగులో పడిన యువకుడిని తాడు సాయంతో పైకి తీస్తున్న గ్రామస్తులు

ఆలేరు రూరల్, జనవరి 31 : మండలంలోని కొలనుపాక పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా శుక్రవారం ఓ వ్యక్తి అందులో పడిపోయాడు. స్థానికులు గమనించి సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. మైలారం బాలకిషన్ శుక్రవారం ఆలేరు నుంచి కొలనుపాకకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కొలనుపాక పెద్దవాగుపై నీళ్లు ప్రవహిస్తున్నా అలాగే పోవడంతో ప్రమాదవశాత్తు అదుపు తప్పి అందులో పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు వాహనంతో సహ బయటికి తీసుకువచ్చారు. తనను రక్షించిన గ్రామస్తులకు బాలకిషన్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

రాజాపేట, జనవరి 31 : మండలంలోని బేగంపేట వాగులో మిషన్ భగీరథ పైపులైన్ పగలడంతో మూడ్రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ సుమిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మరమ్మతులకు మూడు రోజులు పట్టనుందని పేర్కొన్నారు. శనివారం నుంచి ఈ నెల 3వరకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కొత్త ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలి'

సంస్థాన్ నారాయణపురం, జనవరి 31 : మండలంలోని రాచకొండ, కడిలబావితండా, వెంకంబావితండా, తుంబావి తండాను కలిపి కొత్త ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజన తండాల ప్రజలు ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ నోముల మాధవరెడ్డి, గిరిజన నాయకులు బాలూనాయక్, గోవర్ధన్‌నాయక్, కరంటోతు రమేశ్‌నాయక్, ప్రజ్ఞానాయక్, లచ్చినాయక్, సిద్ధునాయక్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 31 : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బైక్‌లు, కార్ల వినియోగం పెరుగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటికి వాహనం నడిపే వారి నిర్లక్ష్యమే కారణమని అన్నారు. అప్రమత్తంగా నిబంధనలు పాటిస్తూ నడపకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్లు ఎంత పెద్దగా ఉన్నా డ్రైవింగ్‌లో క్రమశిక్షణ లేకపోతే యాక్సిడెంట్‌లు జరుగుతాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ఎప్పుడూ ప్రమాదమేనని, దాంతో వాహనం నడిపే వారితోపాటు రోడ్డు మీద వెళ్లే వారికి ప్రమాదాలు జరుగుతాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇప్పటి వరకు యాక్సిడెంట్లు చేయకుండా ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా రవాణా శాఖ అధికారి సాయికృష్ణ, డీఈఓ సత్యనారాయణ, ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిహారం కాదు.. మా ప్రాణాలు ముఖ్యం

- రసాయన పరిశ్రమలను శాశ్వతంగా మూసివేయాల్సిందే
- కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడికి స్థానికుల ఫిర్యాదు

పీసీబీ మెంబర్ శరత్‌చంద్రారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దామోదర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : చౌటుప్పల్ మండలం అంతమ్మగూడెం, పరిసర ప్రాంతాల సమీపంలో రసాయన కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలను మూసివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. శ్రీజయ, వినీత్, హజేలో, బృందావన్ లాబొరేటరీలు, కెమిక్ లైఫ్ సైన్స్, రావుస్ ఈ లాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ వంటి రసాయన పరిశ్రమలు విపరీతమైన వాయు, జల, భూ కాలుష్యానికి పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. కెమిక్ పరిశ్రమకు కాలుష్య నియంత్రణ మండలి జనవరి 27న ఇచ్చిన క్లోజర్ ఆర్డర్‌లో స్పష్టత లేదనే కారణంతో శుక్రవారం చౌటుప్పల్ మండలానికి చెందిన గుమ్మి దామోదర్‌రెడ్డి నేతృత్వంలో రైతులు హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కార్యాలయంలో పీసీబీ బోర్డు సభ్యుడు ఎం.శరత్‌చంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు ఇచ్చే పరిహారం తమకు ముఖ్యం కాదని, స్థానికుల ఆరోగ్యం రీత్యా ఆ పరిశ్రమలను శాశ్వతంగా మూసివేయాలని కోరారు. రోజూ ఉదయం, సాయంత్రం, రాత్రి పూట పరిశ్రమల యాజమాన్యాలు వ్యర్థ వాయువులను గాల్లోకి వదులుతున్నాయని తెలిపారు.

6 నెలల్లో 38 ట్యాంకర్లు..

కెమిక్ లైఫ్‌సైన్స్ పరిశ్రమ యాజమాన్యం ఆరు నెలల్లో 38 ట్యాంకర్ల ద్వారా రసాయన వ్యర్థాలను తరలించి బహిరంగ ప్రదేశాల్లో గ్రామ సమీపంలో ఉన్న హజేలో, బృందావన్ లాబొరేటరీల నుంచి వచ్చే విపరీతమైన దుర్వాసనను భరించలేకపోతున్నామన్నారు. ఈ పరిశ్రమల యాజమాన్యాలు అనుమతి లేని ఉత్పత్తులను తయారు చేస్తున్నాయని, పారిశ్రామిక వ్యర్థ జలాలను పరిశ్రమ లోపల ఉన్న ఖాళీ స్థలంలో, సమీపంలోని బంజరు భూముల్లో, ఖాళీ బోరు బావుల్లో వదిలేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మినీ వాహనాల్లో డ్రమ్ములు, ట్యాంకర్ల ద్వారా తరలించి మూసీ పరీవాహక ప్రాంతంలో వదిలేస్తున్నారని తెలిపారు. వదిలివేసినట్లు వివరించారు. 2024 డిసెంబర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీకి వస్తున్నారని తెలిసి శ్రీజయ లాబొరేటరీస్ పరిశ్రమలో ఉన్న వ్యర్థ రసాయన జలాలను, అనుమతి లేని ఉత్పత్తులన్నింటినీ వాహనాల ద్వారా తరలించారని చెప్పారు. పరిశ్రమకు సంబంధించిన గేట్ రిజిస్టర్, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే ఈ విషయం నిర్ధారణ అవుతుందన్నారు. గ్రామస్తులందరం ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు సీసీ టీవీ ఫుటేజీని పీసీబీ అధికారులు సేకరించలేదని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలోని లాబొరేటరీ అధికారులు, సిబ్బంది తప్పుడు నివేదికలు ఇస్తూ.. పరిశ్రమల యాజమాన్యానికి సహకారం అందిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా గ్రామస్తులు అనేక రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్న, కాలుష్యానికి పాల్పడే పరిశ్రమలకు సహకారం అందిస్తున్న పీసీబీ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి కారణమైన పరిశ్రమల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఫిర్యాదుపై స్పందించిన పీసీబీ మెంబర్ ఎం.శరత్‌చంద్రారెడ్డి తక్షణమే రసాయన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రఘును ఆదేశించారు.

కోర్టు కేసులో ఉన్న భూమిలో అక్రమ నిర్మాణం

యాదగిరిగుట్ట, జనవరి 31 : పట్టణంలోని గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 122/1లో ఎకరం, 122/2 లో ఎకరం భూమికి సంబంధించిన భూ తగాదా కేసు జిల్లా జూనియర్ సివిల్ కోర్టులో ఉండగా కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని బాధితురాలు ఆరె.కావ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం మున్సిపల్ కార్యాలయం అనుమతి లేకుండాచే నిర్మాణం చేస్తున్నారని, వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డిని కోరారు. దీనికి ఆయన సరిగా స్పందించడం లేదని, నిర్మాణం గురించి తమకు తెలుసుని, చిన్న రూమే కదా! అంటూ మున్సిపల్ కమిషనర్ రాజీ కుదుర్చే ప్రయత్నాలు చేస్తున్నారని బాధితురాలు ఆరోపించారు.

మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

రాజాపేట, జనవరి 31 : మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 21మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ స్థానంలో రఘునాథపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి అభిరాం, రాజాపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి శరణ్య ద్వితీయ, చల్లూరు పాఠశాల విద్యార్థి ముంతాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుడుగు జానయ్య, శ్రీనివాసాచారి, పలుగు రాజు, నవీన్, సత్యానంద్, పారిజాత, మాధవీలత, రాంప్రసాద్, గౌస్ పాల్గొన్నారు.

కుల వివక్ష పాటిస్తే చట్టపరమైన చర్యలు

ఆత్మకూరు(ఎం), జనవరి 31 : గ్రామాల్లో కుల వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్ఐ మల్లికార్జున్‌రావు అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని మోదుగుబావిగూడెంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దళితవాడలో నెలకొన్న సమస్యలను అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవానీ శంకర్‌స్వామి ఆలయ కమిటీ

వలిగొండ, జనవరి 31 : మండలంలోని రెడ్లరేపాక గ్రామంలోని భవానీ శంకర్‌స్వామి ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చెవ్వ భిక్షపతి, వైస్ చైర్మన్‌గా కమ్మంపాటి రమేశ్, డైరక్టర్లుగా పొన్నం రమేశ్, పాల్వంచ గణేశ్, కందుల నరేశ్, కోమల్ల మత్స్యగిరి, దేశబోయిన మల్లేశ్, బోదాసు బాలరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేశ్, నరేశ్, సూర్యనారాయణ, శంకరయ్య, బాలస్వామి, కిష్టయ్య, రాజు, రఘునాథం, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సుమన్, జహంగీర్ పాల్గొన్నారు.

శివకుమార్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల నివాళి



శివకుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

మోత్కూరు, జనవరి 31 : మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన సకినాల శివకుమార్ ప్రథమ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు లోతుకుంట స్వామి, మాజీ సర్పంచులు బత్తిని తిరుమలేశ్, హనుమంతు, నాయకులు పొన్నెబోయిన మత్స్యగిరి, అంజయ్య, సతీశ్, ధనుంజయ్, ప్రభాకర్, అజయ్, యాదగిరి పాల్గొన్నారు.

నిందితులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

- కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

కూల్చిన గోరీలను పరిశీలిస్తున్న కేవీపీఎస్, అఖిలపక్ష నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 31 : దళితులు, పేదల సమాధులు కూల్చిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. మండలంలోని తుక్కాపురం గ్రామంలో అక్రమంగా కూల్చిన గోరీలను కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులు, గ్రామస్తులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, పేదలపై దాడులు, హత్యలు జరిగినా, వారి భూములు గుంజుకున్నా, వారి శ్మశానవాటికలను ఆక్రమించుకున్నా పోలీసు యంత్రాంగానికి, అధికారులకు, పాలకులకు పట్టదన్నారు. దళితులు, పేదల గోరీలు కూల్చి 25 రోజులు గడుస్తున్నా నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. శ్మశానవాటిక భూమిని ఆక్రమించుకోవడానికి కంతం దయాకర్, కంతం దినేశ్ రాత్రికి రాత్రి జేసీబీలతో గోరీలను కూల్చి, బొందలను తవ్వి వాటిని బాయి బొందలో పోసి పూడ్చడం దారుణమన్నారు. ప్రజలందరి సమస్యగా భావించి అధికారులు, పోలీసులు వారికి అండగా ఉండవలసిన సమయంలో నిందితులను కాపాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్, డీసీపీ, సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి గోరీలను కూలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశానవాటిక చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆ భూమికి రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండమడుగు నర్సింహ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుబ్బ లింగం, అన్నంపట్ల కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి గ్యార అశోక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు, మాజీ సర్పంచులు నోముల మహేందర్‌రెడ్డి, పుట్ట వీరేశం, మాజీ ఎంపీటీసీ రాసాల మల్లేశం, నల్లమాస సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడుమేకల మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో యువత మధ్య స్నేహభావం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నాయకుడు సైదులు

కట్టంగూర్, జనవరి 31 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా పోటీలు యువత మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పీఏసీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు నూక సైదులు అన్నారు. మండలంలోని పందనపల్లి గ్రామంలో ఫ్లయింగ్ ఈగల్ యూత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ సహకారంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ముప్పిడిముప్పిడి యాదయ్య, నాయకులు మేకల రమేశ్, గద్దపాటి నర్సింహ, నిమ్మనగోటి శివ, పులి పరుశయ్య, గద్దపాటి యాదగిరి, మహేశ్, సునీల్ పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో సీనియర్ సివిల్ జడ్జి తనిఖీ

వలిగొండలో బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ

వలిగొండ, జనవరి 31 : మండల కేంద్రంలోని శాంతి నిలయం బాలికల వసతి గృహాన్ని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషశ్రీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో భోజనాలను, వంటశాలను, డార్మెటరీ, బాత్రూమ్‌లతోపాటు శానిటేషన్ వసతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ నింబంధనల మేరకు విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్‌రెడ్డి, అడ్వకేట్ రోసి, సాయిదీప్, శ్రీశైలం, గణేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, జనవరి 31 : డీఆర్‌డీఏలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం అదనపు కలెక్టర్ గంగాధర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది మూడు నెలల నుంచి జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు త్వరగా ఇప్పించాలని, పే స్కేల్, ప్రమోషన్లు కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓలు శ్రీలక్ష్మి, కరుణాకర్, విక్రమ్, టీఏలు కె.రమేశ్, వైఆర్ చారి, నాగరాజు, శ్రీనివాస్, ప్రశాంతి, లలిత, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద

ఆత్మకూరు(ఎం), జనవరి 31 : ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మంచి వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రగతి నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధి, డయాబెటిక్‌తోపాటు జ్వరాల బారిన పడిన వారి వివరాలను సేకరించి జిల్లా అధికారులకు నివేదిక అందించాలన్నారు. సమావేశంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ, సీహెచ్ఓ కర్ణాకర్, ఆరోగ్య ఉప కేంద్రాల వైద్యాధికారులు అశోక్, స్వాతి, దివ్య, వాణి, సూపర్‌వైజర్లు సాంబులమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులుకు సన్మానం



ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు దంపతులను సత్కరిస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం గౌడ్

ఆలేరు టౌన్, జనవరి 31 : ఎక్సైజ్ సూపరింటెండెంట్ సెగ్గెం సైదులు పదవీ విరమణ కార్యక్రమాన్ని రాయగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు దంపతులను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు తక్షణ నష్టపరిహారం అందించడంలో సైదులు ముందంజలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు జూకంటి ఉప్పలయ్య, గీత కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ కృష్ణ

యాదగిరిగుట్ట, జనవరి 31 : జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వై.కృష్ణ రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. పాఠశాల ముందు వాహనాల వేగంతో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు ట్రాఫిక్ సీఐ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రిస్తామని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు శ్రీధర్‌రెడ్డి, సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బావిలో పడిన నక్క.. బయటకు తీసిన స్థానికులు

రెడ్డిబావి గ్రామంలో పాత బావిలో పడ్డ నక్క

చౌటుప్పల్ రూరల్, జనవరి 31 : మండలంలోని రెడ్డిబావి గ్రామ పరిధిలోని పాడుబడిన బావిలో శుక్రవారం నక్క పడిపోయింది. స్థానికులు గమనించి గ్రామంలో విషయం చెప్పగా.. దాన్ని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు వచ్చారు. స్థానికులు నక్కను బయటికి తీసి అటవీ అధికారులకు అప్పగించారు.